వాణిజ్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం · ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 2 | 09-10-2023 | పుటలు : 4



## ఇస్రో ప్రయోగాలతో కీర్తి పతాకం రెపరెపలు

**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభించిన వీసీ ఆచార్య పద్మరాజు**

**06.10.23 (మీడియాసెల్)**

విద్యార్థులు ప్రతి రంగంలో అసలైన లీడర్లుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె పద్మరాజు పేర్కొన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలో ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇస్రో ఆధ్వర్యంలో శు క్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజెస్ అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఇస్రో కార్యకలాపాల వివరాలు, రాకెట్స్ నమూనాల ప్రదర్శనను వీసీ ఆచార్య కె. పద్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డా.అబ్దుల్ కలాం చేత మొట్టమొదటి రాకెట్ ప్రయోగం చేయించిన సతీష్ ధావన్, అది విఫలం కావడంతో దాని బాధ్యత తనపై వేసుకున్నారన్నారు. ఆతర్వాత మరో రాకెట్ ప్రయోగం చేయించి విజయం సాధించడంతో ఆ ఘనత డా.కలాంకు ఇచ్చారన్నారు. వైఫల్యాన్ని తాను తీసుకుని, విజయాన్ని ఇతరులకు ఇవ్వడం అసలైన లీడర్ గొప్పతనమని ఆయన విశ్లేషించారు. ఇస్రో ప్రయోగాల వలన భారత కీర్తి పతాక రెపరెపలాడుతోందన్నారు. తాజాగా చంద్రయాన్ విజయవంతంతో ప్రపంచం అంతా భారత్ వైపు చూస్తుందన్నారు. తాను ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధన చేసినపుడు తరచూ సబ్జెక్టులు మారడం వలన అడ్వాన్స్ శాటిలైట్ సబ్జెక్ట్ కూడా బోధించానని ఆయన గుర్తు చేసుకున్నారు. విద్యావిధానంలో కూడా అనూహ్య మార్పులు వస్తున్నాయని ఆయన చెబుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలన్నారు. ఇస్రో రూపొందించిన బ్రోచర్ ని వీసీ పద్మరాజు ఆవిష్కరించారు.

**అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి : కమిషనర్ దినేష్ కుమార్**

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె దినేష్ కుమార్ సూచించారు. తాము చదుకునే సమయంలో ఇలాంటి అవకాశాలు లేవని, ఇలాంటి విషయాలు పెద్దగా తెలియవని అన్నారు. ఇప్పుడు సౌకర్యాలు, అవకాశాలు మన ముందుకు వస్తున్నందున వినియోగించుకోవాలని ఆయన అన్నారు. రోజుకి పదివేల మంది విద్యార్థులు సందర్శించేలా ప్రణాళిక వేసినట్లు తెలిపారు. చంద్రయాన్ విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.



**రాబోయే రోజుల్లో అంతరిక్ష పర్యాటకం : శ్రీహరికోట ఎస్.డి.ఎస్.సి.డిప్యూటీ డైరెక్టర్ టి ఎస్.రఘురామ్**

రాబోయే రోజుల్లో అంతరిక్ష పర్యాటకం రాబోతోందని, అందుకు అనుగుణంగా ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు సాగిస్తోందని పేర్కొన్నారు. అంతరిక్షానికి అవధి లేదని, ఈ విశ్వం అనంతమని, అపారమని, ఎవరికీ చెందని సంపద ఉందన్నారు. స్వాతంత్ర్య అమృతోత్సవం నేపథ్యంలో అంతరిక్ష విజ్ఞానాన్ని ఇంటింటికి తీసుకెళ్లే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 2016 నుంచి అంతరిక్ష వారోత్సవాలను వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని జిల్లాస్థాయి, తాలూకా స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఏడాది 'స్పేస్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్' పేరుతో అంతరిక్ష వారోత్సవాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 9 బిలియన్ డాలర్ల వ్యాపారం సాగుతుండగా 2047 నాటికి 70 రెట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

**స్పేస్ వాక్ కి విశేష స్పందన : శ్రీహరికోట షార్ ఎస్ఎస్-ఎస్ ఎఫ్ జనరల్ మేనేజర్ ఎన్. విజయకుమార్**

ఆంధ్రప్రదేశ్ లో రాజమండ్రితో పాటు విశాఖ, కర్నూల్, శ్రీహరి కోట లలో వారోత్సవాలు చేస్తున్నామని, మిగిలిన చోట్ల అన్ని సౌకర్యాలున్న ఇంజనీరింగ్ కాలేజీలలో చేస్తుంటే రాజమండ్రిలో మాత్రం ప్రజల మధ్య చేస్తున్నట్లు చెప్పారు. స్పేస్ వాక్ కి మంచి స్పందన లభించి 3,500మంది విద్యార్థులు పాల్గొనడం ఒక రికార్డు అని పేర్కొన్నారు. తొలుత ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు నమో భారతావని, వేదంలా ఘోషించే గోదావరి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ట్రిప్స్, తదితర స్కూల్స్ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలను కూడా ఇందులో ఉంచారు. కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల ఎన్ సిసి కేడెట్స్, పీఈటీలు సేవలందిస్తున్నారు. పలు స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శన తిలకించారు. అనంతరం అతిథులను ఇస్రో పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరికోట ఎస్.డి.ఎస్.సి.డిప్యూటీ డైరెకర్ టి ఎస్.రఘురామ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె దినేష్ కుమార్, శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ ఎన్. విజయకుమార్, ఎస్ డి ఎస్ సి హెడ్ బడ్జెట్ లీలా నాగ శ్రీనివాస్, రాజమహేంద్రి మహిళా కళాశాల చైర్మన్ టి. కె. విశ్వేశ్వర రెడ్డి, పలువురు ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఉప విద్యాశాఖాధికారి నారాయణ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలాత్రిపుర సుందరి, అక్షర శ్రీ స్కూల్ డైరెక్టర్ టి నాగరత్నం, ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ నాయకులు భాస్కర రామయ్య, పురెడ్ల కళ్యాణ్ రెడ్డి, రవిచంద్ర, ఏ రమేష్, పి. సురేష్, ప్రగతి మురళి, ప్రసాద్ స్కూల్ ప్రసాద్, జస్వర్ స్కూల్ రమేష్, పి గంగాధరరావు, డివి స్వామిరెడ్డి, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు మండెల శ్రీరామ్మూర్తి. అధ్యక్షులు కె. పార్ధసారధి, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఉపకులపతి ఉవాచ



### విద్యార్థులారా!

ఏపీ పీజీ సెట్‌లో ఉత్తమమైన ర్యాంకులు సాధించి విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో, అనుబంధ కళాశాలల్లో ప్రవేశిస్తున్న మీ అందరికీ నా శుభాకాంక్షలు! అధ్యాపకుల విలువైన పాఠాల్ని, గ్రంథాలయ సేవల్ని సద్వినియోగం చేసుకుంటూ స్వీయ క్రమశిక్షణతో మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకుంటారని ఆశిస్తున్నాను. విద్యార్థి సామర్థ్యం అనేది క్రమ పద్ధతిలో లభించే శిక్షణతో కలసి ప్రావీణ్యంగా,నైపుణ్యంగా మారుతుంది. విస్తృత అధ్యయనం, నిబద్ధత, సమయపాలన, లక్ష్య నిర్దేశాలు మిమ్మల్ని విజయ సోపానాల మీద నిలబెడతాయి. స్వీయ క్రమశిక్షణను పొందుతూ ఎదగడాన్ని మించింది ఏదీలేదు. మెరుగైన ఉత్తమమైన మార్గాల వైపు బాధ్యతగా మీరు ప్రయాణించాలని, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా నిర్మాణం కావాలని ఆకాంక్షిస్తూ స్వాగతం పలుకుతున్నాను.

ఆచార్య కె.పద్మరాజు

## మంచిమాట



పారిశుద్ధ్యం అనేది అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యకరమైన శరీరంలోనే ఉంటుంది.

- మహాత్మా గాంధీ

# సంపాదకీయం



## అరుదైన శాబ్దికుడు

తెలుగు వారికి పరిచయం చేయాల్సిన అవసరంలేని కవి శ్రీశ్రీ. గొప్ప కవిత్వం రాసిన కవి గుండెలో ఏదో గాయం ఉండి ఉంటుందని అంటారు సోమర్సెట్ మామ్.

కార్మికుని, కర్షకుని గుండెకు తగిలిన గాయాల్ని గేయాలుగా రాసిన కవి. అంతేకాదు " కష్టజీవి "కి అటు ఇటుగా నిలబడ్డ " కవి " కూడా.

కమ్యూనిజంలో నిజం ఉందని నమ్మి మరో ప్రపంచం పిలుపు విని పదండి ముందుకు, పదండి త్రోసుకు పోదాం పోదాం అని పొగ గొట్టపు ఘూంకార ధ్వని, రాబందుల రెక్కల చప్పుడు వినిపించాడు.

వర్జిన్ సాయిల్ నవల్లో తుర్గేనీవ్ విప్లవానికి జగన్నాథ రథచక్రాలతో పోలిక తెచ్చాడు. దాంతో శ్రీశ్రీ రథచక్రాలను ఆకాశపుదారుల్లోంచి భూమార్గం పట్టించి భూకంపం పుట్టించాడు. ప్రాచీనాంధ్ర కవుల లెక్కలేనన్ని శబ్దశక్తి ప్రభావాలన్నీ శ్రీశ్రీ మీదున్నాయి. అందుకే ఎవరూ తొంగిచూడని అగాధాల్ని వర్ణించాడు. అనితర సాధ్యం నా మార్గం అనిచెప్పి తన తర్వాత మరోలా రాయటానికి వీలు లేకుండా చేశాడు.

గురజాడ ముత్యాలసరాలతో పాటు 1910 లోపుట్టి పద్దెనిమిదో ఏటనే ప్రభవ రచించి ముప్పైమూడో ఏట భువన భవనపు బావుటాగా ఎగిరి జయభేరి మోగించాడు. కదం తొక్కుతూ పదం పాడుతూ ప్రపంచం వైపు ప్రయాణం సాగించాడు. దాంతో తెలుగు కవిత్వానికి వస్తువు, భాష, నడక మారిపోయింది.

ఘర్మజలానికి ఖరీదు కట్టి పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులైన దగాపడిన తమ్ములకోసం కలంపట్టి తన గీతాల్ని జాతిజనులు పాడుకునే మంత్రంగా మార్చిన శాబ్దికుడయ్యాడు శ్రీశ్రీ. తెలుగు కవిత్వాన్ని వెలుగుదారుల్లో నడిపించిన దారిదీపమయ్యాడు.

కుక్కపిల్లను, అగ్గిపుల్లను, సబ్బు బిళ్ళను కవితా వస్తువులుగా మార్చి కవిత్వ చైతన్య పరిధిని విస్తరింపజేసి తెలుగు ప్రజల హృదయాల్లో శ్రీశ్రీ గా ముద్ర వేసుకున్న బిరుదైన భావుకుడయ్యాడు.

లైబ్రరీలో పురావస్తు పరిశోధకుల్లా తిరుగుతూ పుస్తకాల్లో కాగితాలను తాకుతుంటే తలుక్కుమని మెరిసి పలకరించే మహత్తరమైన ఇటువంటి కవులు, రచయితలు బోలెడంత మంది. ఎటుపోజేసి మనం లైబ్రరీకి వెళ్లి ఆ పుస్తకాలని ముట్టుకోవాలంతే!!

# ఘనంగా గురుబ్రహ్మ పురస్కారాలు



రాజమంద్రి ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్ లో చారిటబుల్ ట్రస్ట్, గోదావరి టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ గురువులు సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించాలని గురువులకు వీసీ సూచించారు. శ్రీహరికోట ఎస్టీ ఎస్ సి మేనేజ్మెంట్ సిస్టమ్స్ గ్రూప్ డైరెక్టర్ పి గోపీకృష్ణ అంతర్జాతీయ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 80 మంది ఉపాధ్యాయులను వీసీ చేతుల మీదుగా గురు బ్రహ్మ పురస్కారాలకు అందజేసారు. దీనిలో యూనివర్సిటీ ఎంబీఏ అధ్యాపకులు డా.మల్లిడి అమ్మిరెడ్డి గురుబ్రహ్మ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు.

# కాకినాడ క్యాంపస్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఎన్లైటింగ్ కెరియర్ ఫర్ మేనేజ్మెంట్ గ్రాడ్ ఇన్ ఎన్ ఎంట్రెప్రెనురల్ పర్స్పెక్టివ్ అనే అంశం మీద జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు. డీసీఎంఎస్ హెచ్ ఓ డి డా.డి అజయ్ రతన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం కమలకుమారి, ప్రముఖ సైకాలజిస్ట్ ఎస్ వై ఎస్ కంపెనీ వ్యవస్థాపకురాలు డా. డి విజయలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం.కమల కుమారి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఏ విధంగా లక్ష్యాలను అవలంబించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి విద్యార్థులు ఒక ఎంట్రప్రెనుర్ గా ఎదగాలంటే ఎలాంటి లక్ష్యాలను ఏర్పరచుకోవాలి, ఒత్తిడిని ఏ విధంగా అధిగమించాలి, లక్ష్యాన్ని ఏర్పరచుకున్నప్పుడు వాటికి ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలి, అలాగే మానసికంగా శారీరకంగా ఏవిధంగా ఉల్లాసంగా ఉంటూ మనకి రాబోయే అవధలను ఎదుర్కోవాలి, ప్రస్తుత కాలంలో యువత ఉపాధి అవకాశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీరామరాజు, డా. అనిల్ అంబిక, డా. మధు కుమార్, మణికంఠేశ్వర్ రెడ్డి, మనోజ్ దేవ, డా. అప్పారావు, డా. శ్రీదేవి, డాక్టర్ ఉమరజిత , ఎస్ శివరామకృష్ణ, యశోద జేఎన్టీయూ, ఆదిత్య కళాశాల, వి.ఎస్.ఎల్ కళాశాల మరియు క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సందీప్ మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ

07.10.23 (మీడియాసెల్)

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి కె. సందీప్ మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ ని శనివారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, కోర్సు కోఆర్డినేటర్ లక్ష్మీ మరియు అధ్యాపకులు, విద్యార్థులు క్రికెట్ ట్రోఫీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్



సందీప్ మెమోరియల్ క్రికెట్ ట్రోఫీని ప్రారంభిస్తున్న దృశ్యం

డా.పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సహకారంతో యాంత్రిక్ క్లబ్ ఆధ్వర్యంలో సందీప్ మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ ని నిర్వహిస్తున్నామన్నారు. సందీప్ మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు చెందిన 16 టీమ్స్ ఎంపిక అయ్యాయని తెలిపారు. ఇంజనీరింగ్ తరగతులకు ఇబ్బంది లేకుండా వారం రోజుల పాటు సాయంత్రం విశ్వవిద్యాలయ మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు.

# నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ విద్యార్థులకు అభినందనలు


04.10.23 (మీడియాసెల్)

ఇటీవల హిమాచల్ ప్రదేశ్ ధర్మశాలలో జరిగిన నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ లో ప్రతిభ కనపరచిన ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లను వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందించారు. బుధవారం యూనివర్సిటీలో నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ కు హాజరైన విద్యార్థులకు వీసీ సర్టిఫికెట్టులను అందజేసి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల నుండి పది మంది విద్యార్థులు మరియు ప్రోగ్రామ్ అధికారి అధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్ ధర్మశాలలో జరిగిన నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ లో ప్రతిభ కనపరిచారని చెప్పారు. పది రోజుల పాటు జరిగన ఈ క్యాంప్ లో రాప్లింగ్, ట్రక్కింగ్ లో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. 65 కిలోమీటర్లు 10500 అడుగుల ఎత్తులో విద్యార్థులు ట్రక్కింగ్ విజయవంతంగా పూర్తిచేసారన్నారు. నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు



విద్యార్థులకు సర్టిఫికెట్టులను అందిస్తున్న వీసీ కె.పద్మరాజు

అటల్ బిహారీ వాజ్.పెయి మౌంట్రింగ్ ఇన్సిట్యూట్ వారి సర్టిఫికెట్టులను అందజేసామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. క్యాంప్ కు హాజరైన ఎన్.ఎస్.ఎస్ పీఓ ఎన్.హేమశ్రీ, విద్యార్థులు పి.వెంకటేష్ (నన్నయ క్యాంపస్), కె.భానుశ్రీ (ఎస్.కె.ఎస్.డి. తణుకు), ఎం.మహేశ్వరి (ఆదిత్య తుని), టి.రవికుమార్ (గైట్ కాలేజ్), పి.ఛాముండేశ్వర్ (ఆదిత్య కాకినాడ), కె.వర్మ(డి.ఆర్.జి కాలేజ్ తాడేపల్లిగూడెం), జి.హరిశిరీషా(రాజమహేంద్రి కాలేజ్), ఎస్.దీనమణి(డి.ఎన్.ఆర్ పాలకొల్లు), పి.యేసు సత్య(ఎస్.వి.కె.పి.పెనుకొండ) సిహెచ్.మానసరెడ్డి(నన్నయ క్యాంపస్) విద్యార్థులు సర్టిఫికెట్టులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై శ్రీనివాసరావు, డీన్ డా.కె. రమనేశ్వరి పాల్గొన్నారు.



చంద్రయాన్ పై ప్రెజెంటేషన్ అందిస్తున్న విద్యార్థి

## చంద్రయాన్3 పై అవగాహన

చంద్రయాన్ - 3 విజయవంతం అయిన సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగానికి చెందిన విక్టర్ క్లబ్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు "ఎ టాక్ ఆన్ చంద్రయాన్" పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో చంద్రయాన్ 1,2,3 కి సంబంధించిన టెక్నాలజీ గురించి విద్యార్థులు పరిశోధించి, మొత్తం 18 గ్రూపులుగా ప్రెజెంటేషన్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్స్ ఎ.విజయదుర్గ, బి.సుధాకిరణ్, న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు ఎస్.ఎన్.సంతోషి, బి.ఎనీకెజియా, విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.



సత్యనారాయణకు ఎస్టేట్ ఆఫీసర్ గా ఉత్తర్వులు అందిస్తున్న వీసీ

## నన్నయ ఎస్టేట్ ఆఫీసర్‌గా కల్నల్ సత్యనారాయణ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ గా లెఫ్టినెంట్ కల్నల్ బొమ్మన సత్యనారాయణ ను నియమిస్తూ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఉత్తర్వులు అందజేసారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో సత్యనారాయణకు ఉత్తర్వులను అందించిన వీసీ వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ హెూదాలో పని చేసి రిటైర్డ్ అయిన బొమ్మన సత్యనారాయణ ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ గా నియమించామని అన్నారు. ఈయన ఇండియన్ ఆర్మీ మరియు సివిల్ ఎస్టాబ్లిష్మెంట్ లో 35 సంవత్సరాల అపారమైన అనుభవంతో దేశ సేవ చేసారన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ లో డిసిప్లేన్, సెక్యూరిటీ, ట్రాన్స్పోర్ట్ వంటి పరిపాలన వ్యవహారాలను పర్యావేక్షిస్తారని తెలిపారు. సత్యనారాయణ తన అనుభవంతో విశ్వవిద్యాలయంలో చక్కని వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. సిబ్బంది అంతా సహకరిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ యూనివర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ గా నియమితులైన లెఫ్టినెంట్ కల్నల్ బొమ్మన సత్యనారాయణ కు శుభాకాంక్షలు తెలియజేసారు.

## నన్నయలో స్వచ్ఛత ఫ్రీడమ్ వాక్




**01.10.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటి ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత ఫ్రీడమ్ వాక్ ఫర్ 3 కిలోమీటర్స్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ ఫిట్ ఇండియా ప్రోగ్రామ్స్ ద్వారా యువతలో ఉత్సహాన్ని నింపుతున్నారని దీనిలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ఫ్రీడమ్ వాక్ నిర్వహించారని అన్నారు. అక్టోబర్ 1 నుండి 31వ తేదీ వరకూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంతో పాటు అనుబంధ కళాశాలల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. శారీర వ్యాయామం తగ్గిపోతున్న నేటి పోటీ ప్రపంచంలో ఫిట్ ఇండియా వంటి ప్రోగ్రామ్స్ మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ నుండి స్వచ్ఛత ఫ్రీడమ్ వాక్ ను వీసీ జెండాఊపి ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలల నుండి ఎనిమిది ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఈ ప్రోగ్రామ్ లో హాజరై చురగ్గా నడిచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఫిట్ ఇండియ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ డా.ఎం.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా.ఎస్.రాజ్యలక్ష్మి, డా.జి.అలీస్ జోయ్, డా.ఎన్.రాజశేఖర్, డా.ఎల్.ముత్యాలునాయుడు, డా.డి.ఎస్.ఆర్.ఎస్.ప్రకాష్, డా.డి.అప్పలరాజు, ఎ.ఎం.శిరీష, డా.ఎం.గోపాలకృష్ణ, డా.కె.వి.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.



ఫిట్ ఇండియా వాక్ ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

## కూచిపూడి డిప్లొమా విద్యార్థులను అభినందించిన వీసీ

**05.10.23 (మీడియాసెల్)**



తిరుపతిలోని సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కూచిపూడి డిప్లమా విద్యార్థులు నృత్య ప్రదర్శన చేసారని వీసీ ఆచార్య కె.పద్మరాజు విద్యార్థులను అభినందించారు. గురువారం యూనివర్సిటీలో వీసీ పద్మరాజు ను కలిసిన కూచిపూడి డిప్లమా అధ్యాపకురాలు, విద్యార్థులను అభినందించిన వీసీ వివరాలను తెలియజేసారు. తిరుపతి బ్రహ్మోత్సవాలలో రెండు రోజులపాటు నన్నయ విశ్వవిద్యాలయ కూచిపూడి విద్యార్థులు మహిషాసుర మర్థిని, నారాయణ స్తోత్రం వంటి కీర్తనలకు చక్కని నృత్య ప్రదర్శన చేసి అందరినీ ఆకట్టుకున్నారని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిప్లమా ఇన్ కూచిపూడి కోర్సు అనుభవజ్ఞురాలైన అధ్యాపకురాలి పర్యావేక్షణలో ఎంతో విజయవంతంగా నడపబడుతుందని అన్నారు. బ్రహ్మోత్సవాలలో నృత్య ప్రదర్శన చేయడం మంచి అవకాశమని, భవిష్యత్ లో మరిన్ని ఉన్నత వేధికలపై నృత్య ప్రదర్శనలను అందించి భారతీయ నృత్య ఔనత్యాన్ని తెలియజేయాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ కూచిపూడి డిప్లమా అధ్యాపకురాలు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డిప్లమో కూచిపూడి డాన్స్ కోర్సు కోఆర్డినేటర్ కె. శ్రీరాజరాజేశ్వరిదేవి, విద్యార్థులు ప్రగడ జ్యోతి, టి.కల్పన తదితరులు పాల్గొన్నారు.





గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

### గాంధీ జయంతిలో వీసీ పద్మరాజు

**02.10.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతిపిత మహాత్మ గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసారు. ఉప్పు సత్యాగ్రహంతో గాంధీజీ దేశ వ్యాప్తంగా చైతన్యాన్ని నింపారని, అహింసతో స్వాతంత్ర్యాన్ని సాధించారని అన్నారు. స్వాతంత్ర్య భారతంలో ప్రజలకు ఎక్కువ స్వేచ్ఛ ఉందని, దానిని సద్వినియోగం చేసుకుంటూ సమాజ హితంగా జీవించాలన్నారు. గాంధీజీ ఆచరించిన దానినే చెప్పే వారని, మనం కూడా గాంధీజీ విధానాలను అనుసరిస్తూ జీవించాలన్నారు. స్వాతంత్ర అనంతరం లాల్ బహదూర్ శాస్త్రి దేశాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవిస్తూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా ఉండాలి సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాకినాడ క్యాంపస్‌లో గాంధీ జయంతి

**02.10.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ నందు జాతిపిత మహాత్మ గాంధీ మరియు మాజీ భారత ప్రధాని గా సేవలు అందించిన లాల్ బహుదూర్ శాస్త్రి గార్ల జయంతిని పురస్కరించుకొని జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ మహమ్మద్ నధిమ్ ముఖ్యఅతిథిగా గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా అహింస మరియు శాంతియుతంగా స్వాతంత్ర సంగ్రామాన్ని ముందుండి నడిపించిన జాతిపితను అలాగే స్వాతంత్ర అనంతరం దేశ ప్రధాని స్థానంలో ముందుండి నడిపించిన లాల్ బహుదూర్ శాస్త్రి ని ప్రేరణగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడి దేశసేవని చేయవలసిందిగా మహమ్మద్ నదీమ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అధికారి డాక్టర్ ఎం శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, శ్రీమతి హేమలత, వి.శ్రీనివాసరావు, అజయ్ కుమార్ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని పూలమాలలతో నివాళులు అర్పించారు.

# నగరం దీవి




ఎక్కడో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ కు 70 కిలోమీటర్ల దూరంలో గల జిల్లా కేంద్రం సీకర్ ప్రాంతానికి చెందిన ఒక రాజస్థానీ బియానీ కుటుంబం 1950 ప్రాంతంలో నగరం దీవిలో అర్థ శతాబ్దం మామిడికుదురు గ్రామంలో జీవించి తర్వాత మరల ఆ గ్రామం నుంచి వలస వెళ్లిపోయినప్పటికీ ఆ ప్రాంతంపై మమకారంతో రాసిన పుస్తకం నగరందీవి.


ఈ పుస్తకంలో నగరం దీవి నైసర్గిక స్వరూపంతో పాటు అనేక చారిత్రక అంశాలు చర్చించారు. తాటిపాక యుద్ధం,నగరం దీవిలోని బౌద్ధ, జైన మతాలు గురించి వివరాలు పరిశీలిస్తే ఈ ప్రాంత చరిత్ర పరిశోధన అవసరాన్ని మన ముందుంచుతుంది.నగరం దీవి స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఈ ప్రాంతంలో అనేకమంది శిక్షకు గురయ్యారు. 1930లో డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారి ఆధ్వర్యంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహం 1932 లో జరిగిన ఖాదీ ఉద్యమంలో పొన్నాడ సూర్యారావు, ఆరుమిల్లి వెంకటరత్నం, బిక్కిన వీరస్వామి, వాడ్రేవు శ్రీరామమూర్తి ఈ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు.

అతి పురాతనమైన ముద్రణాలయం రాధాకృష్ణ ప్రెస్ పేరుతో రాజోలులో ఉండటం సుదర్శన్ అనే పత్రిక ఇక్కడ నుంచే ప్రచురింపబడేదనే వివరాలు రచయిత మన ముందుంచారు. అంతేకాకుండా నగరం దీవిలోని స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు అందించారు.

1942 జూన్ లో గుడిమిళ్ళంకలో ఫాసిస్టు వ్యతిరేక సభ వెయ్యి మందితో జరిగిన ఊరేగింపు,ఫాసిజం దిష్టిబొమ్మను తగులు పెట్టడం,3000 మందితో వ్యవసాయ కూలీల సభ జరగటం, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చాలామంది ప్రతినిధులు రావడం ఈ ప్రాంతం స్వాతంత్ర్యానికి ముందే ఎంతో చైతన్యవంతమైందని తెలుస్తుంది.

మొదటి దళిత కవి కుసుమ ధర్మన్న గారు 1921లో మాకొద్దీ నల్లదొరతనం అంటూ గేయం రాసి చైతన్యపరిచిన విషయం బోయి భీమన్న రాసిన నాటకం పాలేరు మొదటి ప్రదర్శన ఎలా జరిగిందో రచయిత వివరించారు. 1929 నగరం దీవిలో గాంధీజీ పర్యటన వివరాలు, నాటి ఏర్పాట్లు మన ముందుంచారు.

ఈ ప్రాంతంలోని దళిత వర్గానికి చెందిన ప్రజల జీవనోపాధి కోసం బర్మా వెళ్లడానికి దారి ఖర్చులకోసం తమ పిల్లల్ని భూస్వాముల వద్ద పశువుల కాపర్లుగా పెట్టి బానిసత్వాన్ని వంశపారంపర్యం చేసే వారి పద్ధతిని కమీన్ కట్టడం అనేవారు. బర్మా వెళ్లి డబ్బు సంపాదించి స్వస్థలానికి తిరిగి వచ్చిన తర్వాత దళిత వెనుకబడిన తరగతుల పిల్లలను 1940 ప్రాంతంలో విద్య వైపుకి మళ్ళించబడటం ద్వారా ఈ ప్రాంతంలో వచ్చిన మార్పును వివరించారు. నగరం దీనికి సంబంధించిన బయ్యా సూర్యనారాయణ (బిఎస్ మూర్తి) 1937 నుంచి 1977 వరకు రాజకీయాల్లో కొనసాగారు. ఆ వివరాలకు తోడు మద్రాసు మంత్రివర్గంలో నగరం ముద్ర, బాల్ బ్యాడ్మింటన్ లో నగరం దేవి హవా మొదలగునవి ఈ పుస్తకంలో మనకు కనిపిస్తాయి. ముందుమాటలో జి.సత్యమూర్తి "మూలాలకు ఓనమాలు" అన్నట్లుగా ఈ నేల తీపి గుర్తులు రుచిని మాకు అందించటానికి బజరంగ్ లాల్ బియాని చేసిన ప్రయత్నం చాలా గొప్పదని అన్నారు.




నగరం దీవి
బజరంగలాల్ బియాని
ప్రతులకు:
కూనపరెడ్డి రాము
మామిడికుదురుజి
9848322008

**సమీక్ష: డా.బిక్కని బాలకృష్ణ రాజనీతిశాస్త్ర విభాగం నన్నయ విశ్వవిద్యాలయం**

# భరతముని ఆరాధనోత్సవాలకు హాజరైన వీసీ



స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ నృత్య ఉత్సవం "భరతముని ఆరాధనోత్సవాలు 2023" రాజమండ్రి ఆనం కళాకేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె.పద్మరాజు, సంస్థ అధ్యక్షుడు డా.ఆదిత్య కిరణ్ మరియు అతిథుల చేతుల మీదుగా వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది నాట్య గురువులకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ భరతముని క్రీ.పూ మూడవ శతాబ్దంలో ప్రాచీన భారత దేశానికి చెందిన పండితుడని, నాట్యశాస్త్రమనే ప్రఖ్యాతమైన గ్రంథాన్ని రాశారని, ఇది ప్రాచీన భారతదేశంలో నాటకరంగంలో ముఖ్యంగా సంస్కృత నాటకాల గురించి రాయబడిందన్నారు. నేటి కాలంలో భారతీయ నాట్య విధానాలన్నింటిలోనూ భరతనాట్యం ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించు కుందన్నారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ బి గ్రేడ్ ఆర్టిస్ట్, నన్నయ యూనివర్సిటీ డిప్లమా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సు కోఆర్డినేటర్ కడలి శ్రీ రాజరాజేశ్వరిదేవి కి నాట్యభూషణ్ అవార్డును వీసీ అందించి అభినందించారు.



# నన్నయలో ఆక్వాకల్చర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ సమావేశం



**03.10.23 (మీడియాసెల్)**
మానవాళికి, పర్యావరణానికి మేలు చేసేలా ఇండియన్ మేజర్ కార్ప్ చేపల పెంపకం పైన అధ్యయనానికి నన్నయ యూనివర్సిటీ మరియు ఫిష్ వెల్ఫేర్ ఇనీషియేటివ్ మధ్య జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా చేపట్టిన పరిశోధన పురోగతులపై అవగాహన సదస్సును నిర్వహించారు. మంగళవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో డీన్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డా.కె.రమణేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సుస్థిర అభివృద్ధిలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన పరిశోధనలో భాగంగా ఫిష్ వెల్ఫేర్ ఇనీషియేటివ్ వారు పూర్తి ఆర్థిక సహాయాన్ని అందించాలని అన్నారు. దీనిలో భాగంగా చేపల చెరువుల నిర్మాణం, బోర్ వెల్ మరియు పరిశోధనకు కావల్సిన అన్ని సౌకర్యాలను సమకూర్చారని చెప్పారు. పరిశోధన ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశోధన సంబంధమైన విషయాలు సులువుగా అవగాహన చేసుకోవచ్చని అలాగే విజ్ఞానాన్ని ఫిష్ వెల్ఫేర్ పరిశోధన నిపుణులతో పంచుకోవచ్చునని అన్నారు. వీరు పరిశోధన చేసి ప్రచురించిన పరిశోధన పత్రాలకు ఫిష్ వెల్ఫేర్ నిధులు మంజూరు చేస్తుందని, అలాగే విద్యార్థులు ఎంఎస్సీ ఆక్వాకల్చర్ పూర్తి చేసుకున్న తరువాత ప్లేస్మెంట్స్ కూడా పొందవచ్చునని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటువంటి పరిశోధనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమని తెలియజేసారు. అనంతరం విద్యార్థులతో జరిగిన అవగాహన సదస్సులో ఫిష్ వెల్ఫేర్ ఇనీషియేటీవ్ మేనేజింగ్ డైరెక్టర్ కార్తీక్ ఆక్వాకల్చర్ పాండ్స్ లో నిర్వహించే పరిశోధనల గురించి తెలియజేసారు. కో.ఫౌండర్ టామ్ బిల్లింగ్టాన్ (TOM BILLINGTON) ఇప్పటివరకూ ఫిష్ వెల్ఫేర్ నిర్వహించిన పరిశోధన విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. యానిమల్ ఆస్క్ కో.ఫౌండర్ జార్జ్ బ్రిడ్వాటర్ (BRIDGEWATER) మాట్లాడుతూ చేపలు కూడా మానవాలి మాదిరిగానే పరిగణించి పెంచాలని, సహజ సిద్ధంగా పెంచడం ద్వారా ఎటువంటి సమస్యలు ఉండవని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు డా.కె.రమణేశ్వరి, ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.కె.నూకరత్నం, డా.పి.వెంకటేశ్వరరావు, డా.వి.పెర్సిస్, డా.బి.జగన్మోహనరెడ్డి, డా.కె.దీప్తి, డా.కె.వి.స్వామి, డా.హైమవాతి, డా.సజనారాజ్, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.ఉమమహేశ్వరి, డా.డి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## సమాచారహక్కుచట్టం దినోత్సవం (అక్టోబర్ 12)

# అవినీతిని అరికట్టేందుకు సమాచారహక్కుచట్టం ఒక వజ్రాయుధం

ప్రభుత్వవ్యవస్థ చాలా పెద్దది. ప్రభుత్వ విధానాలు పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా చూడటం చాలా కష్టం. ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు,సంక్షేమం,పేదరిక నిర్మూలన కోసం రూపొందించిన కార్యక్రమాలు సాధారణంగా వారికి సరిగాచేరక నిధులు మళ్లించబడతాయి. దీనికి ప్రధాన కారణం అవినీతి . ప్రభుత్వ కార్యక్రమాల గురించి అవి అమలు అయ్యే తీరు గురించి ప్రజలకు సరైన సమాచారం లేకపోవటం, అవినీతి పెరగటానికి ఒక ముఖ్యమైన కారణమవుతోంది.
అవినీతిని నియంత్రించటానికి దేశ పౌరుల చేతిలో ఉన్న ఆయుధమే "సమాచార హక్కు చట్టం 2005" ఈచట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వం నుండి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా పెద్ద మొత్తంలో ప్రభుత్వనిధులు అందే సంస్థల్లో ప్రజలకు కావలసిన సమాచారాన్ని పొందే హక్కు ఉంటుంది.ఈ హక్కు కోసం మొదటిగా రాజస్థాన్ రాష్ట్ర ప్రజలు ఉద్యమించారు. రాజస్థాన్లో కొంతమంది ప్రజలు మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన (MKSS) సంఘటితమై"పనికి ఆహార పథకానికి సంబంధించి సమాచారం అడగసాగారు. ప్రభుత్వం నుంచి ప్రజలు సమాచారం పొందటానికి ఆ రోజులలో ఎటువంటి చట్టబద్ధమైన హక్కు లేదు. అడిగిన సమాచారాన్ని ఇవ్వటానికి అధికారులు నిరాకరించేవారు. రాజస్థాన్ రాష్ట్ర ప్రజలు మూడు సంవత్సరాల పాటు ప్రదర్శనలు ఊరేగింపులలో ఉద్యమించారు. ఎన్నో సంవత్సరాల పోరాటం తరువాత అధికారిక సమాచారాన్ని వెల్లడి చేయటాన్ని తప్పనిసరి చేస్తూ 1995లో రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన హరిదేవ్ చేసి ఒక చట్టాన్ని చేశారు. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ చట్టాన్ని అవలంబించాయి.
కేంద్రంలో అప్పటి ప్రధాని అయిన" డాక్టర్ మన్మోహన్ సింగ్ " జాతీయస్థాయిలో పార్లమెంటులో 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టం చేసింది. ఇది 12 అక్టోబరు 2005 నుండి అమల్లోకి వచ్చింది. కావున ఆ రోజున "సమాచారపు హక్కు చట్టం దినోత్సవం" గా జరుపుకుంటారు. ప్రస్తుతం సమాచార హక్కును రాజ్యాంగం రెండు ప్రాథమిక హక్కుల కింద భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కు గా గుర్తిస్తున్నారు. ప్రజల ఉద్యమం కారణంగా పౌరులకు హక్కులను కల్పిస్తున్న రాజ్యాంగంలోని అంశాల కారణంగా, ఈ చట్టం రూపొందింది. ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమానికి ప్రజల సొమ్మే ఉపయోగిస్తున్నారు. కాబట్టి ఈ డబ్బు ఎలా వినియోగం అవుతుందో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రభుత్వ శాఖలు, కొన్ని నియమ, నిబంధనల ఆధారంగా పని చెయ్యాలి. విద్యా శాఖలో పాఠశాల పుస్తకాలు కొనటానికి, మధ్యాహ్న భోజనాలు పెట్టటానికి ,వసతి గృహాలలో, ఆరోగ్య శాఖలో ఆసుపత్రి ,డాక్టర్లు,నర్సులు ఎంపిక,నియామకం బదిలీలకు సంబంధించి లేదా మందుల కొనుగోలు, పంపిణీలో, రెవెన్యూ శాఖలో భూమిరికార్డులు మొదలగు ప్రభుత్వ రంగాలలో, కార్యాలయాలలో అధికారుల నుండి కావలసిన సమాచారాన్ని పొందవచ్చు.
ఒక శాఖ పని చేయటంలో అవకతవకలు జరిగాయన్న సమాచారం ఉందని అనుకుందాం. ఏ వ్యక్తులైన సమాచారాన్ని సేకరించి అవలంబించిన విధానాన్ని సవాలు చేయవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులను ఏ వ్యక్తి అయినా ప్రభుత్వ ఆదేశాలు, నివేదికలు సలహాలు, లాగ్ పుస్తకాలు, నియమ నిబంధనలు ,హాజరు పట్టికలు ,ఉత్తరాలు ,రికార్డులు డాక్యుమెంట్లు ,మెమోలు ,ఈ మెయిల్స్ మొదలగు వంటి వాటి ద్వారా సమాచారం కావాలని అడగవచ్చు. ఆ సమాచారం తనకు ఎందుకు కావాలో వివరించిన అవసరం లేదు.మానవ అభివృద్ధి ప్రజాస్వామిక హక్కులకు సమాచారం కీలకమైనది అధికారిక పత్రాల రూపంలో తగినంత సమాచారం ఉన్నప్పుడే ప్రజలు పాలనలో భాగస్వాములై న్యాయపారమైన అభివృద్ధి జరిగేలా చూడగలుగుతారు. సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండటంవల్ల ప్రభుత్వాలు తమ పనితీరులో మరింత జవాబుదారీగా ఉంటాయి. దీనివల్ల వాటి పనితీరును పర్యవేక్షించడం అవినీతి జరగకుండా చూడటం సాధ్యమవుతుంది.పేదల మనుగడకు సమాచారం చాలా కీలకమైనది. ప్రజాస్వామ్యానికి అన్ని విషయాలు తెలిసిన పౌరులు కావాలి సమాచారంలో పారదర్శకత ఉండాలి. ఇది అవినీతి అరికట్టటానికి దోహదపడుతుంది. ప్రభుత్వాలు ప్రతి ఒక్క పౌరునికి జవాబుదారీగా ఉంటాయి. ఇంతకుముందు మాదిరిగా ప్రభుత్వ శాఖలు కేవలం ఎన్నికైన ప్రజాప్రతినిధులకే స్పందించటం కాకుండా ఇప్పుడు అన్ని సాధారణ పౌరులకు కూడా సమాధానాలు చెప్పవలసి ఉంటుంది.




**- దీప్తి**
**పొలిటికల్ సైన్స్,బి.ఎడ్,అనూర్**



# ఎవరికి లాభం?!

సముద్రమంతా నీళ్లు ఉంటే ఎవరికి లాభం?
దాహం తీర్చుడానికి ఉపయోగపడనప్పుడు.
ఆకాశమంత మేఘాలు ఉంటే ఎవరికి లాభం?
ఒక్క చినుకైనా నేలకు రాలనప్పుడు.
కోట్ల కొలది ఆస్తులు ఉంటే ఎవరికి లాభం?
ఒక్క పైసా కూడా దానం చేయనప్పుడు.
కష్టపడి పొలం సాగు చేస్తే ఎవరికి లాభం?
రైతుకు గిట్టుబాటు ధర దొరకనప్పుడు.
ఊరంతా బంధువులు ఉంటే ఎవరికి లాభం?
ఆపద సమయంలో ఆదుకునే మనస్తత్వం లేనప్పుడు.
దారి వెంట ఎన్ని చెట్లు ఉంటే ఎవరికి లాభం? నిలువ నీడ ఇవ్వలేనప్పుడు.
మనిషైనా,మాటైనా, వస్తువైనా అర్థం లేనప్పుడు, ప్రయోజనం లేనప్పుడు ఏంటి లాభం?
అవసరానికి ఉపయోగపడినప్పుడే కదా!జీవితానికి అర్థం వచ్చేది!! పరమార్థమయ్యేది!!

**-బి.సుశాంత్**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in